ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి : డీఈవో

ములుగురూరల్, జూలై 31 : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎమ్మార్పీలు కృషి చేయాలని డీఈవో పాణిని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై ఎమ్మార్పీలకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని క్వాలిటీ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించగా డీఈవో హాజరై మాట్లాడారు. మన రాష్ట్రాన్ని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేతో ఉన్నత స్థానంలో నిలిపేందుకు ఎమ్మార్పీలు ఉపాధ్యాయులకు విద్యపై శిక్షణ ఇవ్వాలని అన్నారు. సదరు ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించి వారు మెరుగుపడేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీలు కృష్ణ, శ్రీకాంత్, సముద్రాల శ్రీనివాసాచారి, హమీద్, సతీశ్‌కుమార్, ఆగయ్య, మధుసూదన్, రాయప్ప, కందాల రామయ్య, కాంప్లెక్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో పాణిని

ఎమ్మెల్యే లక్ష్మణ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

ములుగురూరల్, జూలై 31 : అసెంబ్లీలో బుధవారం ధర్మపురి ఎమ్మెల్యే వడ్డూరి లక్ష్మణ్ దళితులపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర దళిత బంధు సాధన సమితి అధ్యక్షుడు కోగిల మహేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. శాసన సభలో రెండో విడుత దళిత బంధు పథకాన్ని కేవలం బీఆర్ఎస్ పార్టీ జెండాలు మోసే వారినే ఎంపిక చేశారని లక్ష్మణ్ అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. మొదటి విడుత 100యూనిట్లను గత ములుగు ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సీతక్క ఎవరికి ఇచ్చారో సైతం తాము వివరిస్తామన్నారు. మహేశ్ వెంట నాయకులు దాసరి రమేశ్, గడ్డం భద్రయ్య, ఊట్ల మోహన్, దినాకర్, చింతరాజు, రెంటాల జనార్దన్ ఉన్నారు.

సీతారాంపూర్‌వాసికి గౌతమి నంది పురస్కారం

గణపురం, జూలై 31 : మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన గోవర్ధన సాయికుమార్ ఆచార్యులు గౌతమి నంది పురస్కారం అందుకున్నారు. విశ్వవిఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ, శ్రీ గౌతమేశ్వర గో సంరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో అకాడమీ చైర్మన్ ఎస్వీఆర్ వెంకటేశ్ దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆధ్యాత్మిక రంగంలో అందించిన సేవలను గుర్తించి అవార్డు అందించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సోమలగడ్డ క్రాస్ వద్ద రేడియం స్టిక్కర్లతో ఏర్పాటు చేసిన టైర్

గోవిందరావుపేట, జూలై 31 : రోడ్డు ప్రమాదాల నివారణకు పస్రా పోలీసులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. చల్వాయి, గోవిందరావుపేట గ్రామాల మధ్య ఉన్న సోమలగడ్డ క్రాస్ వద్ద జాతీయ రహదారిపై సిగ్నల్ లైట్ లేక గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగి 10మంది వరకు మృత్యువాత పడ్డారు. దీంతో పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్‌లు రాత్రి వేళల్లో ప్రమాదాలను నివారించేందుకు టైర్‌కు రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో వాహనాల లైట్ల వెలుగులకు స్టిక్కర్లు మెరుస్తూ కనిపిస్తున్నాయి. అదేవిధంగా చల్వాయిలోని రెవెన్యూ అతిథి గృహం యూటర్న్ వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా రెండు బారికేడ్లను ఏర్పాటు చేశారు. త్వరలో జాతీయ రహదారిపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

ఆటో యూనియన్ నాయకుల అరెస్టు

అరెస్టు అయిన ఆటో యూనియన్ నాయకులు

ములుగురూరల్, జూలై 31 : ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి జిల్లా నుంచి తరలివెళ్లిన 30మంది ఆటో యూనియన్ నాయకులు హైదరాబాద్‌లో అరెస్టు అయ్యారు. ములుగుకు చెందిన ఆటో యూనియన్ నాయకులు ఎండీ హైమద్, రత్నం రమేశ్, మధుర కుమార్, గట్ల వీరస్వామి, పులి భద్రయ్య, తిరుపతి చారి, ప్రసాద్, జిలేందర్, రాజేందర్, కిరణ్‌లు మాట్లాడుతూ న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన తమను అక్కడి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారని తెలిపారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆటో కార్మికుల కోసం ప్రత్యేక బడ్జెట్ రూ.10కోట్లు కేటాయించడంతోపాటు ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ కుటుంబాలకు రూ.20లక్షలు, 8వేల ఉన్న ఇన్సూరెన్స్‌లను వెయ్యికి తగ్గించాలని, ప్రత్యేక ఆటో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫార్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

CHANGE OF NAME

★ I, VIJAYRAJ RP S/o JASRAJ JI RP (New Name), previously called RAJPUROHIT BAGRAJ (Old Name), and residing at H.No. 12-1-137, Pinnavari Street, Warangal Dist., T.S, India, and solemnly declare.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

దండేపల్లిలో కార్డన్ సెర్చ్

మహాముత్తారం, జూలై 31 : మండలంలోని సింగారం జీపీ పరిధి దండేపల్లిలో బుధవారం సీఐ నాగార్జునరావు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ములుగురూరల్ : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న యువత ములుగు పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో చేపట్టే వాలీబాల్ టోర్నమెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ తేదీ వరకు పీఎస్‌కు వచ్చి టీమ్ సభ్యుల వివరాలను అందించాలన్నారు. విజేతలకు బహుమతితోపాటు జిల్లాస్థాయి మెగా టోర్నీలో అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. 87126 70082, 8712670081ను సంప్రదించాలన్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

కృష్ణకాలనీ, జూలై 31: జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి ఆన్‌లైన్‌లో ఐదు ఇన్‌స్పైర్ నామినేషన్లకు అప్లై చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి బీ స్వామి తెలిపారు. ఎస్‌పీఈఆర్‌టీ డైరెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గణితశాస్త్ర చిట్యాల, రేగొండలో నిర్వహించిన కాంప్లెక్స్ మీటింగ్‌లకు డీఎస్‌వో ముఖ్య అతిథిగా హాజరై ఇన్‌స్పైర్ నామినేషన్‌పై అవగాహన కల్పించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ కే ప్రవీణ్, రాంనారాయణ, రాంబాబు, విద్యాసాగర్, చిట్యాల ఇన్‌చార్జి హెచ్ఎం రఘుపతి, రేగొండ గెజిటెడ్ హెచ్ఎం కృష్ణకుమారి పాల్గొన్నారు.

గురుకులంలో చన్నీళ్ల స్నానాలు

- పనిచేయని సోలార్ వాటర్ హీటర్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పనిచేయని సోలార్ వాటర్ హీటర్స్

ఏటూరునాగారం, జూలై 31 : ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్స్ పని చేయకపోవడంతో విద్యార్థులు చన్నీళ్ల స్నానాలతో ఇబ్బందులు పడుతున్నారు. చలికాలం, వర్షాకాలంలో విద్యార్థులు స్నానం చేసేందుకు అవసరమైన వేడి నీటిని అందించేందుకు పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్స్ పని చేయడం లేదు. విద్యార్థుల సంఖ్యను బట్టి సీఎస్ఆర్ నిధులతో సోలార్ వాటర్ హీటర్‌లను ఏర్పాటు చేశారు. కొన్ని పాఠశాలల్లో నీటిని వేడి చేసే గ్లాస్ ట్యూబ్‌లు పగిలిపోవడంతో పనిచేయడం లేదని తెలుస్తోంది. మరి కొన్ని చోట్ల వాటర్ కనెక్టివిటీ సక్రమంగా లేక లీకేజీతో నిరుపయోగంగా ఉన్నాయి. ప్రతి ఏటా వాటి నిర్వహణకు టెక్నీషియన్లు టెస్టింగ్ చేసే వారు. కానీ గత ఏడాది నుంచి వీటిని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఒక్కో సోలార్ వాటర్ హీటర్ విలువ సుమారు రూ. 1.80 లక్షలు ఉంటుందని సమాచారం. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తీసుకురావాల్సి ఉండగా గిరిజన సంక్షేమశాఖ అధికారులు నిర్లక్ష్యంపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని నిర్వాహకులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకపోయినప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదు. పాఠశాల పునఃప్రారంభ సమయంలో సమస్యలు, వసతులను గుర్తించేందుకు ప్రత్యేకాధికారులను నియమించారు. ఆయా అధికారులు పాఠశాలలను సందర్శించి సమస్యలను నమోదు చేసుకున్నారు. అందులో మైనర్ రిపేర్లు మాత్రం చేపట్టి చేతులు దులుపుకున్నారు. కానీ, సోలార్ వాటర్ హీటర్స్ లాంటివి మాత్రం మరమ్మతు చేయించ లేదు. ఏటూరునాగారంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, బాలుర ఆశ్రమ పాఠశాల, బాలికల డిగ్రీ కాలేజీ హాస్టల్, బ్రాహ్మణపల్లి ఆశ్రమ పాఠశాల, చుంచుపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల, తాడ్వాయి, కొడిశాల, ఆలుబాక ఆశ్రమ పాఠశాలల్లో ఇవి పనిచేయడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా ఏటూరునాగారం మండల కేంద్రంలో కోతుల బెడద నుంచి కాపాడేందుకు సోలార్ వాటర్ హీటర్స్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వొద్దు

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగురూరల్, జూలై 31 : విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వొద్దని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. బుధవారం ఆయన జిల్లాకేంద్రంలోని బాల సదనం, గడిగడ్డలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం, షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహాన్ని అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలతా లెనినాతో కలిసి పరిశీలించారు. వసతులు, సౌకర్యాలు, గదులను, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, వసతి, మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ సుమతి, డీసీపీయూ బాలల పరిరక్షణ అధికారి కృష్ణవేణి, బాల సదనం చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ సంధ్య, కౌన్సిలర్ రాణి పాల్గొన్నారు.

రుణమాఫీ ఫిర్యాదులను పరిష్కరించాలి

రైతు రుణ మాఫీ సహాయ కేంద్రంలో స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రుణమాఫీ సహాయక కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. పేర్లు లేని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. డీఏవో విజయ్‌చంద్ర, ఏడీఏ శ్రీపాల్, ఏంఏవో సంతోష పాల్గొన్నారు. అంతర్జాతీయ హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న బొమ్మరాజు శివాజీ జిల్లా స్పోర్ట్స్ అధికారి తుల రవితో కలిసి కలెక్టర్‌ను కలువగా ఆయన అభినందించి సన్మానించారు. వారి వెంట కోచ్ పర్వతాల కుమారస్వామి ఉన్నారు. అలాగే విద్యార్థుల మౌలిక వసతులపై కలెక్టరేట్‌లో ఎస్సీ, బీసీ, మైనార్టీ, కేజీబీవీ గురుకుల హాస్టల్స్ నిర్వహణపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నిరంతర విద్యుత్, భోజనం నాణ్యతతో ఉండాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.


పూలరత్నమాలను సన్మానిస్తున్న సీపీవో శామ్యూల్

పూల రత్నమాలకు ఘన సన్మానం

కృష్ణకాలనీ, జూలై 31: జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయంలో గణాంక అధికారి పూల రత్నమాల అంకిత భావంతో పనిచేశారని జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ అధికారి కే శామ్యూల్ అన్నారు. సీపీవో కార్యాలయంలో గణాంక అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన రత్నమాలను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ అప్పగించిన విధులను రత్నమాల సకాలంలో పూర్తి చేసి అధికారుల మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సంజీవ రావు, డీపీఆర్వో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి

టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మల్ఛూర్‌నాయక్

కృష్ణకాలనీ, జూలై 31 : ఖాళీ ప్రదేశాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని టీజీ ఎన్పీడీసీఎల్ జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల సూపరింటెండెంట్ ఇంజినీర్ మల్ఛూర్‌నాయక్ అన్నారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని విద్యుత్ ప్రగతి భవన్‌లో వన మహోత్సవం నిర్వహించగా ఆయన సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడారు. సర్కిల్ ఆఫీస్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆపదలో ఉన్నాం ఆదుకోండి'

చికిత్స పొందుతున్న మంద శ్రీనివాస్

మహాముత్తారం, జూలై 31 : రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న తమ కుటుంబ పెద్దను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మండలంలోని బొర్లగూడెం గ్రామానికి చెందిన మంద శ్రీనివాస్ మహదేవపూర్‌కు వెళ్లి ఆటోలో వస్తున్నాడు. ఈక్రమంలో కటారం– మేడారం ప్రధాన రహదారిలో ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హనుమకొండలోని ఓ దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు తలలో రక్తం గడ్డకట్టి పక్కటెముకలు విరిగిపోయాయని తెలిపారు. వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పడంతో నిరుపేద కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నది. ఫోన్ పే 6309817474 నంబర్‌కు దాతలు సాయం చేయాలని కుటుంబ సుభ్యులు కోరుతున్నారు.

బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో మరమ్మతులు చేపట్టాలి

ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

అధ్యాపకులతో మాట్లాడుతున్న పీవో చిత్రమిశ్రా

ఏటూరునాగారం, జూలై 31 : మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో నెలకొన్న మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ఆదేశించారు. కళాశాలను పీవో బుధవారం సందర్శించి పరిశీలించారు. పై కప్పు లీకేజీ, విద్యుద్దీకరణ, తా గునీటి సరఫరాలో కీలకమైన మరమ్మతులను వెంటనే గుర్తించి చేపట్టాలని గిరిజన సంక్షేమశాఖ ఈఈ వీరభద్రంను ఆదేశించారు. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్, ల్యాబ్ పరికరాలు, ఏమైనా అవసరముంటే వెంటనే గుర్తించాలని ఏటీడీవోకు సూచించారు. నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించి స్టాకు వివరాలను తెలుసుకున్నారు. కళాశాలలోని ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడారు. అనంతరం ఐటీడీఏకు సంబంధించిన పాత క్వార్టర్స్‌ను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈఈ వీరభద్రం, ఎస్వో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా వైద్యశిబిరాలు

వాజేడు/తాడ్వాయి/కన్నాయిగూడెం, జూలై 31 : వైద్య సిబ్బంది బుధవారం శిబిరాలు ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వాజేడు మండలంలోని పేరూరు పీహెచ్‌సీ పరిధిలోని దుబ్బగూడెం గ్రామంలో వైద్యాధికారి తరుణ్ ఆధ్వర్యంలో, నాగారం, మండపాక సమీపంలోని గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారికి వాజేడు వైద్యబృందం ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తాడ్వాయి మండలకేంద్రంలోని కేజీబీవీ పాటు మండలంలోని మేడారం, గంగారం గ్రామాల్లో వైద్యాధికారి రణధీర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించి జ్వర బాధితులకు మందులు పంపిణీ చేశారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న వారి రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. కన్నాయిగూడెం మండలంలోని గంగగూడెంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఉషారాణి ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కాటారం సబ్ డివిజన్ టీఎంఎఫ్ కమిటీల ఎన్నిక

కాటారం, జూలై 31 : కాటారం సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల వారీగా తెలంగాణ మ్యాథ్స్ ఫోరం (టీఎంఎఫ్) నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో బుధవారం టీఎంఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ములుగుపల్లి హెచ్ఎం సంజీవరెడ్డి సమక్షంలో కమిటీలను ఎన్నుకున్నారు. కాటారం అధ్యక్షుడిగా గంట రాజబాబు, ప్రధాన కార్యదర్శిగా బీ కవిత, కోశాధికారిగా రవీందర్, మహాముత్తారం మండల అధ్యక్షుడిగా కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా డీ రాము, కోశాధికారిగా రవీంద్రనాథ్, మహదేవపూర్ మండల అధ్యక్షుడిగా పీ సుధారాణి, ప్రధాన కార్యదర్శిగా కే సారంగపాణి, కోశాధికారిగా జే రవీందర్, మల్హర్ మండల అధ్యక్షుడిగా రఘు కుమార్, ప్రధాన కార్యదర్శిగా జగన్ నాయక్, కోశాధికారిగా ఎన్ శ్రీధర్‌రెడ్డి, పలిమెల మండల కన్వీనర్‌గా కే లతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయులు పవన్‌కుమార్, శ్రీధర్, రాజేంద్రప్రసాద్, సునీత పాల్గొన్నారు.

'చెరువుల్లో జాలీల ఏర్పాటుకు అనుమతివ్వాలి'

కృష్ణకాలనీ, జూలై 31: చెరువుల్లో చేపలను కాపాడుకోవడానికి జాలీల ఏర్పాటుకు అనుమతివ్వాలని మొగుళ్లపల్లి మాజీ జడ్పీటీసీ, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని చెరువులు, కుంటల్లో చేపలు పెంచుకుంటూ 118 మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. చేపలను కాపాడుకునేందుకు మత్స్యకారులు జాలీలు ఏర్పాటు చేస్తే ఇరిగేషన్ అధికారులు అడ్డుకుంటూ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లాకేంద్రంలో ర్యాలీ, అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడుతూ జాలీలు ఏర్పాటు చేయకపోతే చెరువుల నుంచి చేప పిల్లలు వెళ్లిపోయి తమ జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి జాలీల ఏర్పాటుకు అనుమతివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. కార్యక్రమంలో మత్స్య శాఖ జిల్లా చీఫ్ ప్రమోటర్ చిలుకల పాణి, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల రాజమౌగిలి, జిల్లా ఉపాధ్యక్షులు చాడ కిష్టస్వామి, సాదా మల్లయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు బడే పుష్పలత, మండల అధ్యక్షులు బోయిని సాంబయ్య, బంటు రమేశ్, దాసరి రాజయ్య, మత్స్య శాఖ జిల్లా డైరెక్టర్లు బండి భద్రయ్య, పర్శవేణి సాంబయ్య, బోయిని తిరుపతి, గడ్డం దుర్గయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుడికి ఘన సన్మానం

దేశిని ఎల్లయ్య దంపతులను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

కృష్ణకాలనీ, జూలై 31 : సింగరేణి కేటీకే-6 గనిలో సపోర్టుమెన్‌గా రిలేబీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన దేశిని మల్లయ్య దంపతులను బుధవారం టీబీజీకేఎస్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాషానపల్లి కుమార్, ఎల్లయ్య, సడవలయ్య, బాపు, రవి, వెంకట రాజం, బాలయ్య, సురేశ్, సమ్మిరెడ్డి, రాజు, స్వామి, గురువారెడ్డి పాల్గొన్నారు. అలాగే ఉద్యోగ విరమణ పొందిన కేటీకే ఓసీ-3 ప్రాజెక్టు ఇంజినీర్ కే విశ్వనాథ్‌ను జీఎం కార్యాలయం సమావేశ మందిరంలో సింగరేణి భూపాలపల్లి ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ వెంకటరామిరెడ్డి, అధికారులు, సహోద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏటీఎం రామకృష్ణారెడ్డి, అధికార ప్రతినిధి అజ్మీరా తుకారం, ఏసీఎంవో డాక్టర్ పద్మజ, డీజీఎంలు రాజబాబు, ఐటీ మేనేజర్ రజిని, ఇంజినీర్లు కృష్ణయ్య, బాలరాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్ భిక్షమయ్య పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ
- ప్రభుత్వ, కేజీబీవీ పాఠశాలలు, దవాఖాన, వంతెన పనుల తనిఖీ

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

టేకుమట్ల, జూలై 31 : వివిధ రంగాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు కావాల్సిన సౌకర్యాలు (ఆర్థిక, మౌలిక) కల్పిస్తామని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లో వసతులు, చదువు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలున్నాయా అని ఉపాధ్యాయులను అడిగారు. స్పోర్ట్స్ గది, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీని పరిశీలించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాల చెరువు కట్ట కింద ఉండడం వల్ల నీరు వస్తున్నదని, తరగతి గదులకు కిటికీలు లేవని, గదుల కొరత, మూత్రశాల సమస్య ఉందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వంటలను పరిశీలించి డైనింగ్ హాల్‌లో ఎందుకు పిల్లలకు వడ్డించడంలేదన్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వెలిశాల పీహెచ్‌సీని సందర్శించి వైద్యాధికారి ఆశాజ్యోతితో మాట్లాడారు. టేకుమట్ల– రాఘవరెడ్డి పేట గ్రామాల మధ్య చలివాగుపై వంతెన పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఆధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అందుకు అవసర మైన సౌకర్యాలు కల్పిస్తామని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఆర్‌డీవో నరేశ్, మండల స్పెషల్ ఆఫీసర్ శైలల, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిత, ఎంపీవో సురేశ్, ఆర్ఐ సంతోష్, ఏపీవో మాధవి, ఎస్వో స్వప్న, హెచ్ఎం సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ ఐలయ్య, కొయ్యల చిరంజీవి, వంగ నరేశ్ పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా ఇసుక లారీల నిలిపివేత

ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రోడ్డుకిరువైపులా నిలిచిన లారీలు

మంగపేట, జూలై 31 : మండలంలోని పాలాయిగూడెం–కొత్తమల్లూరు మధ్య బుధవారం రోడ్డుపై రెండు వరుసలుగా లారీలు నిలిపారు. దీంతో చాలాసేపు ట్రాఫిక్ జామ్ వాహనాలు ఎక్కడికక్కడే నిలిపోయా యి. లారీలను రోడ్డుకు ఇరు వైపులా నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం నిత్యకృత్యంగా మార